క్లుప్తంగా

ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన



మలక్‌పేట: దిల్‌సుఖ్‌నగర్‌లోని సిద్ధార్థ డిగ్రీ కాలేజ్‌లో మంగళవారం బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఏసీపీ జి.శంకర్‌రాజు మాట్లాడుతూ.. ప్రమాదాల రహిత సమాజం కోసం తప్పనిసరిగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలన్నారు. పీపీటీ ప్రజెంటేషన్‌తో ప్రస్తుతం జరుగుతున్న ప్రమాదాలు, నేరాలు పట్ల తీసుకోవాల్సి జాగ్రత్తల గురించి ఆయన వివరించారు. సమయాన్ని వృథా చేసుకోకుండా క్రమశిక్షణతో భవిష్యత్‌కు పునాదులు వేసుకోవాలని విద్యార్థులకు సూచించారు.

'ప్రశ్నించే గొంతుకలను నొక్కేస్తున్నారు'

మహేశ్వరం: రాహుల్ గాంధీపై అనర్హత వేటు వేయడాన్ని నిరసిస్తూ యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో మహేశ్వరం నియోజకవర్గంలో మంగళవారం రాత్రి కాగడాల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేనారెడ్డి మాట్లాడుతూ.. గాంధీ కుటుంబం పట్ల బీజేపీ వ్యవహరిస్తున్న తీరుపై క్షేత్రస్థాయిలో పోరాటం చేయాలని పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బీజేపీ ప్రశ్నించే గొంతుకలను నొక్కేస్తుందని మండిపడ్డారు.

'బీజేపీ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోంది'



నాగోలు: బీజేపీ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోందని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆరోపించారు. రాహుల్ గాంధీ ఎంపీ సభ్యత్వాన్ని రద్దు చేయడాన్ని వ్యతిరేకిస్తూ మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నాగోలు చౌరస్తాలో గాంధీ విగ్రహం వద్ద నిరసన దీక్ష చేపట్టారు. కాంగ్రెస్ పార్టీ ఎల్‌బీనగర్ ఇన్‌చార్జ్, టీపీసీసీ ప్రతినిధి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్, జీహెచ్‌ఎంసీ కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జక్కిడి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఓబీసీ సామాజిక వర్గాన్ని అవమానించేలా రాహుల్ వ్యాఖ్యల్లో ఏముందని వారు ప్రశ్నించారు. ఈ దేశాన్ని లలిత్, నీరవ్, నరేంద్ర మోదీలు దోచుకోలేదా..?, దేశ సంపదను దోచుకుని లలిత్, నీరవ్ మోదీలు విదేశాల్లో జల్సాలు చేస్తున్నది నిజం కాదా అని ప్రశ్నించారు.

'సమస్యల పరిష్కారంలో కేంద్రానికి చిత్తశుద్ధి లేదు'

నాగోలు: కేంద్ర ప్రభుత్వం ఆర్‌ఎస్‌ఎస్ ఎజెండాను అమలు చేస్తుందని సీపీఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య ఆరోపించారు. ఎల్‌బీనగర్ నియోజకవర్గం సీపీఐ కౌన్సిల్ విస్తృత స్థాయి సమావేశం నాగోలు బండ్లగూడ సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కె.చందు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో జంగయ్య మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం నిత్యం మతాల పేరుతో ప్రజలను రెచ్చగొట్టడం తప్ప ప్రజా సమస్యల పరిష్కారం కోసం చిత్తశుద్ధితో పనిచేయడం లేదని ఆరోపించారు. ప్రజా వ్యతిరేక విధానాలను మానుకోవాలని ఆయన సూచించారు.

యువత స్వశక్తితో ఎదగాలి

హస్తినాపురం: ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా యువత స్వశక్తితో ఎదగాల్సిన అవసరం ఉందని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ అన్నారు. హస్తినాపురం డివిజన్ జిల్లా పరిషత్ రోడ్డులోని ద్వారకానగర్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన ద్వారకా బాంకెట్‌హాల్‌ను కార్పొరేటర్ సుజాతానాయక్, బీఆర్‌ఎస్ నాయకుడు గజ్జెల మధుసూదన్‌రెడ్డి ప్రారంభించారు. బీఆర్‌ఎస్ నాయకులు రోహిత్‌రెడ్డి, గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, భిక్షపతి ముదిరాజ్, టిల్లూయాదవ్, రాజు, శశి పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత

హయత్‌నగర్: అనుమానంగా సంచరిస్తున్న వ్యక్తి నుంచి 200 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్ట్ చేసిన ఘటన మంగళవారం హయత్‌నగర్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. హయత్‌నగర్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్‌గౌడ్ వివరాల మేరకు.. వనస్థలిపురం పనామా గోడౌన్ వద్ద ఎం.ఓంప్రకాష్‌రెడ్డి అనుమానాస్పదంగా తిరుగుతున్నాడు. సమాచారం అందుకున్న సరూర్‌నగర్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవిందర్‌రావు ఆదేశాలతో ఏఈఎస్ హనుమంతరావు ఆధ్వర్యంలో హయత్‌నగర్, సరూర్‌నగర్ ఎక్సైజ్ పోలీసులు అనుమానాస్పదంగా తిరుగుతున్న ఓంప్రకాష్‌రెడ్డిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేశారు. 200 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్న పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

వసూళ్లలో వేగం..

- ఆస్తి పన్ను, ట్రేడ్ లైసెన్స్‌ల ఫీజుల వసూళ్లలో వేగం పెంచిన అధికారులు
- ఎల్‌బీనగర్‌లోని మూడు సర్కిళ్లలో రెండింటిలో అతి తక్కువ వసూళ్లు
- 61.55 శాతం వసూళ్లతో ప్రథమ స్థానంలో నిలిచిన ఎల్‌బీనగర్ సర్కిల్



ఎల్‌బీనగర్ సర్కిల్ కార్యాలయం

ఎల్‌బీనగర్: ఎల్‌బీనగర్ మూడు సర్కిళ్ల పరిధిలో ఆస్తి పన్నుతో పాటు ట్రేడ్ లైసెన్స్‌ల ఫీజుల వసూళ్లలో అధికారులు వేగం పెంచారు. మార్చి 31న పన్ను చెల్లింపు గడువు ముగియనున్నడంతో అధికారులు చిరు వ్యాపారులతో పాటు బడా మాల్స్‌పై దృష్టి సారించారు. వ్యాపారాలు చేయాలంటే తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలని అధికారులు వ్యాపారులకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ మూడు సర్కిళ్ల పరిధిలో ట్రేడ్ లైసెన్స్ ఫీజుల వసూళ్లలో ఎల్‌బీనగర్ సర్కిల్ గ్రేటర్ పరిధిలోనే మొదటి స్థానంలో ఉంది. ప్రతి షాపు యజమాని వద్దకు వెళ్లి ట్రేడ్ లైసెన్స్ తీసుకునే విధంగా అవగాహన కల్పించి వారికి వెంటనే ట్రేడ్ లైసెన్స్‌లు జారీ చేయడంతోనే ఆదాయం పెరుగుతోంది. ఇదే తరహాలో అన్ని సర్కిళ్లలో చేస్తే గ్రేటర్‌కు భారీగా ఆదాయం వచ్చే అవకాశం ఉంది. మూడు సర్కిళ్ల పరిధిలో ట్రేడ్ లైసెన్స్‌ల ద్వారా రూ. 6.18 కోట్ల ఆదాయం సమకూరింది.

సర్కిళ్ల వారీగా ఆదాయం ఇలా..

- ఎల్‌బీనగర్ మూడు సర్కిళ్ల పరిధిలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అధికారులు సమన్వయంతో పనిచేస్తే ట్రేడ్ లైసెన్స్‌ల ద్వారా భారీగా ఆదాయం వచ్చే అవకాశం ఉంది. కొందరు సిబ్బంది వ్యాపారుల పట్ల చూసీ చూడనట్లు వ్యవహరిస్తుండడంతో ఆదాయానికి గండి పడుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి.
- ఎల్‌బీనగర్ సర్కిల్–3లో 2,088 మంది ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకుని వ్యాపారాలు చేస్తున్నారు. వారి ద్వారా ఇప్పటి వరకు రూ. 2.11కోట్ల ఆదాయం సమకూరింది. అంటే కేవలం 35.58 శాతం మాత్రమే వసూలైంది.
- సర్కిల్–4లో 3,650 మంది ట్రేడ్ లైసెన్స్ దారులు ఉన్నారు. వీరి ద్వారా సుమారు రూ. 2.21 కోట్ల మేర ఆదాయం వచ్చింది. 61.55 శాతం వసూళ్లతో గ్రేటర్ పరిధిలోని అన్ని సర్కిళ్లలో ఎల్‌బీనగర్ ప్రథమ స్థానంలో నిలిచింది.
- సర్కిల్–5లో 2,681 మందికి ట్రేడ్ లైసెన్స్‌లు ఉన్నాయి. ఇక్కడ ఇప్పటి వరకు రూ. 18.5 కోట్లు వసూలైంది. అంటే 35.73 శాతం వసూళ్లు మాత్రమే పూర్తయ్యాయి.
- రోజువారీ వసూళ్లలో సైతం ఎల్‌బీనగర్ సర్కిల్–4 ముందంజలో ఉంది. మిగితా రెండు సర్కిళ్లు వసూళ్లలో బాగా వెనుకబడి ఉన్నాయి.

గ్రేటర్‌లోనే ప్రథమ స్థానం



ట్రేడ్ లైసెన్స్‌ల ద్వారా వచ్చే ఆదాయంలో ఎల్‌బీనగర్ సర్కిల్ గ్రేటర్‌లోనే ప్రథమ స్థానంలో నిలిచింది. ప్రతి రోజూ సిబ్బందిని అప్రమత్తం చేస్తూ వసూళ్లపై టార్గెట్ ఇవ్వడంతో పాటు స్వయంగా తాను పర్యవేక్షిస్తుండడంతో వసూళ్లలో పెరుగుదల కనిపిస్తోంది.

– సురేందర్‌రెడ్డి, సర్కిల్–4 డీసీ

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నాం



డివిజన్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: నిర్దిష్టమైన ప్రణాళికలతో డివిజన్‌లోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు జీహెచ్‌ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని బాలాజీనగర్, చంద్రపురికాలనీ, సెంట్రల్ బ్యాంక్ కాలనీల్లో మంగళవారం కార్పొరేటర్ మార్నింగ్ వాక్ చేపట్టి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని చంద్రపురికాలనీ నుంచి కాకతీయ స్కూల్ వరకు వరద కాలువ పనులు త్వరలో చేపట్టనున్నట్లు తెలిపారు. కాలనీలలో డ్రైనేజీ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని చెప్పారు. డ్రైనేజీ ఆధునీకరణ పనులను త్వరలోనే చేపడతామన్నారు.

రోడ్డు మరమ్మతు పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి

చైతన్యపురి: పాడైపోయిన రహదారుల ప్యాచ్‌వర్కులు త్వరగా పూర్తి చేయాలని గడ్డిఅన్నారం డివిజన్ కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి అన్నారు. డివిజన్‌లోని కోదండరాం నగర్ కాలనీలో జరుగుతున్న రోడ్డు మరమ్మతు పనులను మంగళవారం కార్పొరేటర్ పరిశీలించారు. భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో రహదారులు ధ్వంసమయ్యాయని, దీంతో ప్యాచ్‌వర్క్ చేపట్టినట్లు ఆయన తెలిపారు. కాలనీవాసులకు ఇబ్బందులు కలుగకుండా పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులకు ఆయన సూచించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్, శ్రీనివాస్, కాంట్రాక్టర్ జిట్టా నవీన్, స్థానికులు రఘునందన్ జోషి, టింకు తదితరులు పాల్గొన్నారు.

సీతారాముల కల్యాణానికి 108 జంటలకు అవకాశం

వనస్థలిపురం: వనస్థలిపురంలోని లక్ష్మీగణపతి దేవాలయం ఆధ్వర్యంలో శ్రీరామనవమి సందర్భంగా గురువారం ఉదయం 10 గంటలకు 108 సీతారాముల ప్రతిమలతో 108 జంటల చేతుల మీదుగా కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. మంగళవారం ఆలయంలో జరిగిన కార్యక్రమంలో సీతారాముల కల్యాణం సందర్భంగా కూర్చునే జంటలకు అందజేసే సీతారాముల ప్రతిమలను వారు ఆవిష్కరించారు. కల్యాణం అనంతరం ఆ ప్రతిమలను వారికే ఇవ్వనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

హరిహర క్షేత్రంలో శ్రీరామనవమి వేడుకలకు ఏర్పాట్లు పూర్తి

మలక్‌పేట: ఈ నెల 30న నిర్వహించనున్న శ్రీరామనవమి వేడుకలకు పల్టాన్‌లోని హరిహర క్షేత్రం, మైసమ్మ దేవస్థానాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ఫౌండర్, ట్రస్టీ సూగూరు రమేష్ తెలిపారు. గురువారం ఉదయం 10 గంటలకు రామచంద్ర స్వామి, సీతాదేవి కల్యాణోత్సవం ఉంటుందన్నారు. ఏప్రిల్ 6 తేదీన గురువారం హనుమాన్ జయంతి సందర్భంగా ఉదయం 6 గంటలకు స్వామి వారికి అభిషేకం ఉంటుందన్నారు.

నగర అభివృద్ధిలో నాది చెరగని ముద్ర

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

లింగోజిగూడ: నగర అభివృద్ధిలో తన ముద్ర చెరగనిదని, హుడా చైర్మన్‌గా ఉన్నప్పుడు ఎన్నో ఫ్లైఓవర్ల నిర్మాణంతో పాటు పార్కుల అభివృద్ధికి కృషి చేశానని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. లింగోజిగూడ డివిజన్ బీఆర్‌ఎస్ కార్యకర్తలు, నాయకులు, కాలనీల వాసులతో మంగళవారం మాజీ కార్పొరేటర్ ముద్రబోయిన శ్రీనివాస్ ఆధ్వర్యంలో కర్మన్‌ఘాట్ కొత్తకాపు యాదవరెడ్డి గార్డెన్స్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎల్‌బీనగర్‌లో రూ.3 వేల కోట్లతో అభివృద్ధి పనులు చేస్తున్నామని, అందులో కొన్ని పనులు పూర్తి కాగా మరికొన్ని పనులు జరుగుతున్నాయన్నారు. బీఆర్‌ఎస్ కార్యకర్తలు, నాయకులు తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు అందేవిధంగా చర్యలు తీసుకోవాలని, నియోజకవర్గంలో జరిగే అన్ని సమావేశాల్లో డివిజన్‌లోని అన్ని కమిటీల సభ్యులు పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ దయానంద్‌గుప్తా, పరిశ్రమల సంస్థ చైర్మన్ అమరవాది లక్ష్మీనారాయణ, నాయకులు గజ్జెల మధుసూదన్ రెడ్డి, శంకరమ్మ, నర్రె శ్రీనివాస్, వరప్రసాద్‌రెడ్డి, తిలక్‌రావు, శ్రీధర్‌గౌడ్, శ్రావణ్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాంత్ చారి విగ్రహం ఏర్పాటు చేస్తాం..

ఎల్‌బీనగర్‌లో చౌరస్తాలోని ఫ్లైవర్ కింద తెలంగాణ అమరుడు శ్రీకాంత్ చారి విగ్రహం ఏర్పాటు చేసే ఆలోచన చేస్తున్నామని, ఇతర కమిటీలతోనూ మాట్లాడి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం శ్రీకాంత్ చారి తల్లి శంకరమ్మతో కలిసి సుధీర్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. శ్రీకాంత్ చారి త్యాగాన్ని తెలంగాణ గడ్డ మరువదని, ఆయన మరణంతో ఉద్యమం మరింత ఎగిసిందని ఆయన అన్నారు.

వనస్థలిపురం సీఐ బదిలీ

హస్తినాపురం: రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ సీఐ కె.సత్యనారాయణను బదిలీ చేస్తూ కమిషనర్ సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఆయనను ఇక్కడి నుంచి మల్కాజిగిరి సీసీఎస్‌కు బదిలీ చేశారు. మల్కాజిగిరి సీసీఎస్‌లో సీఐగా విధులు నిర్వహిస్తున్న డి.జలేందర్‌రెడ్డిని వనస్థలిపురం సీఐగా నియమిస్తూ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రధాని మోదీని కలిసిన ఓబీసీ మోర్చా నాయకులు



సైదాబాద్: ప్రధాని నరేంద్ర మోదీని కలుసుకునే అవకాశం రావడం ఉత్తేజాన్ని కలిగిస్తుందని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి లింగాల హరిగౌడ్ పేర్కొన్నారు. మంగళవారం ఢిల్లీలో నిర్వహించిన జాతీయ ఓబీసీ మోర్చా నాయకుల సమావేశానికి ప్రధాని మోదీ హాజరయ్యారు. ఈ సందర్భంగా మోర్చా నాయకులతో కలిసి హరిగౌడ్ ప్రధానిని కలిశారు. నిరంతరం ప్రజలతో మమేకం కావాలన్న ప్రధాని సూచనలను తప్పకుండా పాటిస్తామని ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు.

రేణుక ఎల్లమ్మకు బోనం



హయత్‌నగర్: ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్‌గుప్తా మంగళవారం కుటుంబ సభ్యులతో కలిసి హయత్‌నగర్‌లోని రేణుక ఎల్లమ్మకు బోనం సమర్పించారు. గతంలో మొక్కుకున్న మొక్కు తీర్చుకునేందుకు 16 బోనాలు సమర్పించినట్లు ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని, రైతులు పాడిపంటలతో విలసిల్లాలని, సీఎం కేసీఆర్ వందేళ్లు జీవించాలని అమ్మవారిని కోరుకున్నట్లు చెప్పారు.

కాల్పుల కేసు నిందితుడిపై పీడీ యాక్ట్

చైతన్యపురి: చైతన్యపురి పోలీస్‌స్టేషన్ పరిధిలోని అల్కాపురి కాలనీలో ఉన్న మహదేవ్ జువెలరీ దుకాణంలో జరిగిన కాల్పుల కేసులో ఓ వ్యక్తిపై చైతన్యపురి పోలీసులు పీడీ యాక్ట్ నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ మధుసూదన్ తెలిపిన వివరాల మేరకు.. సికింద్రాబాద్ గణపతి జువెలరీ దుకాణం నుంచి నగలు డెలివరీ చేసేందుకు రాగా అదే సమయంలో దుండగులు కాల్పులకు పాల్పడ్డారు. సీసీ కెమెరాల ఫుటేజ్ ఆధారంగా పది మంది నిందితులను అరెస్ట్ చేశారు. నిందితులంతా చర్లపల్లి జైలులో రిమాండ్ ఖైదీలుగా ఉన్నారు. వారిలో రాజస్థాన్‌కు చెందిన బన్సీరాం అలియాస్ మనీష్ దేవసి (23)పై పీడీ యాక్ట్ నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ఈ కేసులో నిందితులందరిపై పీడీ యాక్ట్ నమోదు చేయనున్నట్లు పోలీసులు తెలిపారు.

'రాష్ట్ర ప్రభుత్వం పేదలను మోసం చేస్తోంది'



సమావేశంలో మాట్లాడుతున్న సామ రంగారెడ్డి

మన్సూరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం 2015లో 58, 59 జీవోలను తీసుకొచ్చి పేదల భూములను రెగ్యులరైజ్ చేస్తామని చెప్పారని, అయితే నేటికీ ఆ హామీ అమలు చేయదని బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి అన్నారు. మన్సూరాబాద్ చంద్రపురికాలనీలోని జిల్లా పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. 120 గజాల లోపు స్థలాలకు ఉచితంగా రెగ్యులరైజ్ చేస్తామని చెప్పి, ఇప్పుడు రూ.20లక్షల నుంచి రూ.60లక్షల వరకు చెల్లించాలంటూ రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలను మోసం చేస్తూ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుందని ఆరోపించారు. లక్ష 25వేల కుటుంబాలు 58, 59 జీవోలతో లబ్ధిపొందాయంటూ మంత్రి కేటీఆర్ అసత్య ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ తహసీల్దార్లను, ఆర్‌డీఓలను తన ఇంటికి పిలిపించి రెగ్యులరైజ్ చేసిన పట్టాలను పేదలకు పంపిణీ చేస్తున్నారన్నారు. తహసీల్దార్ కార్యాలయాల్లో జరగాల్సిన కార్యక్రమాన్ని తన సొంత కార్యక్రమం మాదిరిగా ఇంట్లో నిర్వహించడం ఏంటని ఆయన ప్రశ్నించారు. కార్యక్రమంలో అశోక్ కుమార్, విజయ్‌కుమార్, నూతి శ్రీనివాస్, కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న రమేష్ తదితరులు

నాగోలు: ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని జాతీయ మాదిగ రాజకీయ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బి.ఎన్ రమేష్‌మాదిగ కోరారు. ఏప్రిల్ 4, 5 తేదీల్లో ఢిల్లీలో నిర్వహించే ధర్నా కరప్రతాలను మంగళవారం ఎల్‌బీనగర్ రింగ్ రోడ్డులో రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు చిటుపాక యాదగిరిమాదిగ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ.. మాదిగల న్యాయమైన డిమాండ్ అయిన ఎస్సీ వర్గీకరణను నెరవేర్చకపోతే బీజేపీ ప్రభుత్వానికి మాదిగలు, మాదిగ ఉప కులాలు బుద్ధి చెప్తారని హెచ్చరించారు. సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు మోదుగు లాజరుమాదిగ, ఎంఎస్‌పీ జాతీయ అధ్యక్షుడు మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

'మాది కబ్జాలు చేసే సంస్కృతి కాదు'



మన్సూరాబాద్: మన్సూరాబాద్ చిన్న చెరువు(కుంట) ప్రాంతంలోని సర్వే నెంబర్ 73, 74ల్లో ఉన్న మా తాత ముత్తాతల వారసత్వ స్థలంలో జీహెచ్‌ఎంసీ నుంచి అన్ని రకాల అనుమతులు తీసుకుని భవన నిర్మాణం చేపడుతున్నామని, మన్సూరాబాద్ కార్పొరేటర్ ఆరోపణలు చేస్తున్నట్లు కబ్జాల సంస్కృతి తమది కాదని బీఆర్‌ఎస్ మన్సూరాబాద్ డివిజన్ అధ్యక్షుడు జక్కిడి మల్లారెడ్డి, యువనేత జక్కిడి రఘువీర్‌రెడ్డి పేర్కొన్నారు. మన్సూరాబాద్ సెంట్రల్ బ్యాంక్ కాలనీలోని తన నివాసంలో మంగళవారం వారు మాట్లాడుతూ.. సర్వే నెంబర్ 69 నుంచి 76 వరకు 15 ఎకరాల 21 గుంటల స్థలం తమకు తాత ముత్తాతల నుంచి వారసత్వ ఆస్తిగా వచ్చిందన్నారు. సర్వే నెంబర్ 73, 74లలోని 8వేల గజాల స్థలంలో నిర్మాణాల అనుమతికి దరఖాస్తు చేసుకున్నామని, ఈ స్థలానికి 2016లోనే ఇరిగేషన్ శాఖ ఎన్‌ఓసీ జారీ చేసిందని చెప్పారు. అన్ని పత్రాలను సరిచూసుకుని జీహెచ్‌ఎంసీ 3వేల గజాలకు మాత్రమే అనుమతి ఇచ్చిందన్నారు. మన్సూరాబాద్ పెద్ద చెరువు ఎఫ్‌టీఎల్ స్థలాన్ని కబ్జా చేసి అక్రమంగా షెడ్లు నిర్మించింది వాస్తవం కాదా అని కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డిని వారు ప్రశ్నించారు. మన్సూరాబాద్ గ్రామ కంఠం స్థలంలో అనుమతులు లేకుండా ఐదంతస్థుల వాణిజ్య భవనాన్ని నిర్మిస్తున్న విషయం నిజం కాదా అని ప్రశ్నించారు.

రుణాలను సకాలంలో చెల్లించండి



రుణ పత్రాలు అందజేస్తున్న చైర్మన్ కృష్ణారెడ్డి

హయత్‌నగర్: రైతులు తీసుకున్న స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలను సకాలంలో చెల్లిస్తే తిరిగి రుణం పొందేందుకు అవకాశం ఉంటుందని, దీంతో పాటు సంఘం అభివృద్ధి చెందుతుందని హయత్‌నగర్ రైతు సేవా సహకార పరపతి సంఘం చైర్మన్ చామ కృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం హయత్‌నగర్లో నిర్వహించిన సంఘం సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రుణాలు తీసుకున్న రైతులు సకాలంలో చెల్లిస్తే రుణమాఫీకి అర్హత పొందుతారని, లక్ష రూపాయల వరకు మాఫీ జరిగే అవకాశం ఉందన్నారు. రైతును రుణాలు ఇచ్చి ఆదుకోవడమే కాకుండా విత్తనాలు, ఎరువులను సబ్సిడీ ధరలకు అందిస్తున్నామని, పంటల దిగుబడి, నాణ్యత పెంచేందుకు తగిన సూచనలు చేస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా ఇళ్ల నిర్మాణం, గొర్రెల పెంపకం కోసం మంజూరైన రుణ పత్రాలను రైతులకు అందజేశారు. కార్యక్రమంలో సీఈఓ మల్లికార్జున్, వైస్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చిరు ధాన్యాల వినియోగంతో సంపూర్ణ ఆరోగ్యం



మహిళలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కార్పొరేటర్ శ్వేతామధుకర్ రెడ్డి

చంపాపేట: చిరు ధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్య రక్షణ లభిస్తుందని భగత్‌సింగ్ నగర్ సెక్టార్ అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నారాయణమ్మ అన్నారు. మంగళవారం పోషణ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చిరు ధాన్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణమ్మ మాట్లాడుతూ.. రాగులు, సజ్జలు, కొర్రలు, సామలు ఆరికెలు, అండుకొర్రలు, ఊదలు క్రమం తప్పకుండా ఉదయం సాయంత్రం విడివిడిగా మూడు మాసాల పాటు తీసుకోవడం ద్వారా బీపీ, షుగర్, రక్తహీనత, ఊబకాయం, అధిక కొలెస్ట్రాల్ అదుపులో ఉండడంతో పాటు శరీరానికి కావాల్సిన ఫైబర్, ప్రొటీన్ పుష్కలంగా లభిస్తుందన్నారు. వయో భేదం లేకుండా అందరూ మిల్లెట్లను వాడవచ్చని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు యాదమ్మ, శ్రీలత, పాఠశాల హెచ్‌ఎం వెంకటనర్సింహారెడ్డి, ఉపాధ్యాయులు అనంతలక్ష్మి, మహేశ్వరి, కళమ్మ పాల్గొన్నారు.

సైదాబాద్: రోజువారీ ఆహారంలో చిరు ధాన్యాలను తప్పనిసరిగా తీసుకోవాలని ఐఎస్‌సదన్ డివిజన్ కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి సూచించారు. మంగళవారం డివిజన్ పరిధిలోని శ్రీసాయి నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషణ పక్షం కార్యక్రమంలో కార్పొరేటర్ పాల్గొన్నారు. పోషణ పక్షంలో భాగంగా చిరు ధాన్యాలతో చేసిన ప్రదర్శనను ఆమె తిలకించారు. చిరు ధన్యాలతో చేసిన వంటకాలను ఆమె బస్తీ మహిళలు, గర్భిణులకు అందజేశారు. జొన్నలు, సజ్జలు, రాగులు, కొర్రలు వంటి చిరు ధాన్యాల్లో పోషక విలువలు సమృద్ధిగా ఉంటాయని ఆమె తెలిపారు.

కాంగ్రెస్ సత్యాగ్రహ సంకల్ప దీక్షలో ఉద్రిక్తత



సత్యాగ్రహ దీక్షలో పాల్గొన్న మల్‌రెడ్డి రాంరెడ్డి, రఘువీరారెడ్డి తదితరులు



దీక్ష ప్రాంగణంలో ఇరువర్గాల వారి తోపులాట దృశ్యం

పార్టీలోని రెండు వర్గాల మధ్య ఘర్షణ

మన్సూరాబాద్: రాహుల్ గాంధీ లోక్‌సభ సభ్యత్వాన్ని రద్దు చేయడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు ఎల్‌బీనగర్ రింగ్ రోడ్డులో ఆ పార్టీ ఇన్‌చార్జి మల్‌రెడ్డి రాంరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం సత్యాగ్రహ సంకల్ప దీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమానికి హాథ్ సే హాథ్ జోడో కార్యక్రమ ఎల్‌బీనగర్ ఇన్‌చార్జి రఘువీరారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా 18 పార్టీలు ఎకతాటిపైకి వచ్చి రాహుల్ గాంధీకి మద్దతు పలుకుతున్నాయన్నారు. దేశ ప్రజల సంపదను కేంద్ర ప్రభుత్వం అదానికి కట్టబెడుతుందని ఆరోపించారు. సంకెపల్లి సుధీర్‌రెడ్డి, భీమిడి రామకృష్ణారెడ్డి, గణేష్‌రెడ్డి, పన్యాల జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

దీక్ష ప్రాంతంలో ఉద్రిక్త వాతావరణం..

ఎల్‌బీనగర్ రింగ్ రోడ్డులో చేపట్టిన సత్యాగ్రహ సంకల్ప దీక్ష కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ ఎల్‌బీనగర్ ఇన్‌చార్జి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి అనుచరులు అడ్డుకున్నారు. ఇరువర్గాల మధ్య తోపులాటతో పలువురు గాయపడ్డారు. ఉద్రిక్త వాతావరణం నెలకొనడంతో పోలీసులు వారిని చెదరగొట్టారు.

పార్టీని బలహీన పరుస్తున్నారు..

పార్టీ ఇన్‌చార్జి అని చెప్పుకుంటున్న రాంరెడ్డి ఎల్‌బీనగర్‌లో పార్టీని బలహీన పరుస్తున్నారని జక్కిడి ప్రభాకర్‌రెడ్డి ఆరోపించారు. ఎల్‌బీనగర్‌లో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. పార్టీ పిలుపు మేరకు నాగోలు చౌరస్తాలో సత్యాగ్రహ దీక్ష చేపడుతుండగా పోటీగా ఎల్‌బీనగర్‌లో రింగ్ రోడ్డులో దీక్ష చేపట్టడంపై మండిపడ్డారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి చెందిన మల్‌రెడ్డి రాంరెడ్డి అక్కడి నుంచి గుండాలను తీసుకొచ్చి ఎల్‌బీనగర్ కాంగ్రెస్ శ్రేణులపై దాడులు చేయిస్తున్నారని ఆరోపించారు.